తెలంగాణ
TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | ఆదివారం-02-అక్టోబర్-2025 | సంపుటి:3 | సంచిక:154 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in



# ఫ్రాన్స్ ప్రతినిధులతో సీఎం రేవంత్ భేటీ

- హైదరాబాద్లో పెట్టుబడులు పెంచాలని ఆహ్వానం



**హైదరాబాద్,నవంబర్01(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి దిశగా అంతర్జాతీయ భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్లో ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లమీ నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో ఫ్రాన్స్ సంస్థల సహకారంతో రాష్ట్రంలో కొనసాగుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతి, కొత్త పెట్టుబడి అవకాశాలు, టెక్నాలజీ మరియు విద్యా రంగాలలో భాగస్వామ్యం వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాదు ప్రపంచస్థాయి నగరంగా ఎదుగుతున్నదని, ఇందులో ఫ్రాన్స్ సంస్థల భాగస్వామ్యం ముఖ్యపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. నగరంలో అమలు జరుగుతున్న ఫ్రెంచ్ సహకార ప్రాజెక్టులు మౌలిక వసతుల అభివృద్ధి, స్మార్ట్ సిటీ టెక్నాలజీ, సాంస్కృతిక మార్పిడి వంటి రంగాలలో ఉన్నత ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. అదే సమయంలో, ఫ్రాన్స్ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. నగరంలోని ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత విస్తరించి, రెండు దేశాల మధ్య పరిశోధన, విద్యా మరియు పారిశ్రామిక సంబంధాలను మరింత దగ్గర చేయాలని సూచించారు. ఈ చర్యల ద్వారా ఫ్రాన్స్-తెలంగాణ మధ్య భాగస్వామ్యం మరింత బలపడుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అలియాన్స్ ఫ్రాన్సైస్ డె హైదరాబాద్ డైరెక్టర్ మోడ్ మిక్వా, బ్యూరో డి ఫ్రాన్స్ అసిస్టెంట్ రోహిణి రెడ్డిపల్లి, మరియు రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఫ్రాన్స్ ప్రతినిధి బృందం కూడా తెలంగాణ ప్రభుత్వానికి తమ సహకారం కొనసాగిస్తామని హామీ ఇచ్చింది.



# రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా పి. సుదర్శన్ రెడ్డి నియామకం

**హైదరాబాద్,నవంబర్01(తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన పి. సుదర్శన్ రెడ్డి, శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాదులోని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు అభినందనలు తెలుపుతూ, రాష్ట్ర అభివృద్ధికి ఆయన అనుభవం ఉపయోగపడుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర పరిపాలనలో సుదర్శన్ రెడ్డి అనుభవం, ప్రజా సేవా దృక్పథం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు దిశానిర్దేశం చేస్తుందనే అభిప్రాయం ఈ సందర్భంగా వ్యక్తమైంది.





# ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

## బీఆర్ఎస్ సీనియర్ నేత వీ శ్రీనివాస్ గౌడ్ ఆవేదన

**హైదరాబాద్,నవంబర్01(తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ బకాయిలు, పెన్షన్ సమస్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ "ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాలు తప్పవు" అని హెచ్చరించారు. ఈ సమావేశంలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, పార్టీ నేత దేవిశ్రీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. "రాష్ట్రం కోసం వారు తమ జీవితం పణంగా పెట్టారు. ఆ ఉద్యోగులకే ఇప్పుడు న్యాయం జరగకపోవడం బాధాకరం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ గారు ఉద్యోగుల సంక్షేమాన్ని అగ్రగామిగా ఉంచి, దేశంలో ఎక్కడా లేని విధంగా ఫిట్ మెంట్ లు, పీఆర్సీలు అమలు చేశారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది" అని ఆయన విమర్శించారు.

ప్రస్తుతం వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులు తమ పెన్షన్ బకాయిల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆయన తెలిపారు. "దాదాపు పదివేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు ఇప్పటివరకు బకాయిలు విడుదల కాలేదు. అనేక మంది ఆర్థిక ఇబ్బందులతో ఇళ్లలోనే నిరాశలో ఉన్నారు. ఇప్పటికే 250 మంది గుండెపోటుతో మరణించారు. వారి మరణాలకు ప్రస్తుత ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు ఇది మానవతా హీనత," అని శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల నిధులను ప్రభుత్వం వాడుకుంటోందని ఆరోపిస్తూ — "ఉద్యోగులు దాచుకున్న డబ్బును ప్రభుత్వం తమ అవసరాల కోసం వినియోగిస్తోంది. ఇది చట్టవిరుద్ధం. ప్రభుత్వం వెంటనే ఈ ప్రవర్తన ఆపి, ఉద్యోగుల నిధులను తిరిగి విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు. అలాగే, 44 శాతం ఫిట్ మెంట్‌ను అమలు చేయాలని, వేతన సవరణలు సమీక్షించాలన్నారు.

మిగతా 2లో..

# వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం

## నల్గొండ,సూర్యాపేటలో బీజేపీ నేతల పర్యటన

**నల్గొండ,నవంబర్01 (తెలంగాణ ముచ్చట్లు):**

నల్గొండ, సూర్యాపేట జిల్లాలలో కురిసిన భారీ వర్షాల కారణంగా పలు గ్రామాలు ముంపుకు గురై పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నల్లమాడ రామచందర్ రావు ముంపు ప్రభావిత ప్రాంతాలను స్వయంగా సందర్శించారు. రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరంగా తెలుసుకున్నారు.

మిగతా 2లో..



# కాంగ్రెస్ తోక కత్తిరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు: మాజీ మంత్రి కేటీఆర్



**హైదరాబాద్,నవంబర్01(తెలంగాణ ముచ్చట్లు):**కాంగ్రెస్ పార్టీ పాలన ప్రజలకు విసుగును కలిగించిందని, త్వరలోనే ప్రజలు కాంగ్రెస్ తోక కత్తిరిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.

మిగతా 2లో..



# తెలంగాణ,కెనడా భాగస్వామ్యానికి బలమైన అడుగులు

**తెలంగాణ,కెనడా బంధం బలోపేతం**
**సీఎం రేవంత్‌రెడ్డి,కెనడా హైకమీషనర్ భేటీ**

**హైదరాబాద్, నవంబర్01 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి దిశగా అంతర్జాతీయ పెట్టుబడులు, సాంకేతిక సహకారం పెంచడంపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారత్‌లో కెనడా హైకమీషనర్ క్రిస్టోఫర్ కూటర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు.

మిగతా 2లో..



# బీసీ రిజర్వేషన్ల అమలుకు బాపూ ఘాట్‌లో ప్రార్థన సభ

**సమాజ న్యాయం సాధన కోసం అందరం ఒకటవ్వాలి**
**టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్,నవంబర్01(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఆధ్వర్యంలో, లంగర్‌హౌస్‌లోని బాపూ ఘాట్‌లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలును డిమాండ్ చేస్తూ విశాలమైన ప్రార్థన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా పీఆర్సీ వర్తింపజేసిన ఘనత కేసీఆర్‌కే చెందుతుందని గుర్తుచేశారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ "ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం చూపితే మేము మౌనం వహించము. బీఆర్ఎస్ పార్టీ ఉద్యోగుల హక్కుల కోసం రోడ్లపైకి వస్తుంది. తెలంగాణ ఉద్యమం ఉద్యోగుల చెమటతో సాధించాం. ఇప్పుడు వారి గౌరవాన్ని కాపాడడం మా బాధ్యత," అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ "రిటైర్డ్ ఉద్యోగులు అనారోగ్యంతో ఉన్నా చికిత్స చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. మెడికల్ రీయింబర్స్‌మెంట్ డబ్బులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం ఉద్యోగులపై చూపిస్తున్న ఈ నిర్లక్ష్యం సిగ్గుచేటు" అన్నారు. ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో ఉద్యోగులు గౌరవం, రక్షణ పొందారని, ఇప్పుడు వారు నిరాశలో మునిగిపోయారని పేర్కొన్నారు.పార్టీ నేత దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ "ఉద్యోగులు కేవలం ప్రభుత్వ సేవకులు కాదు; వారు తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం. వారి కష్టాన్ని గుర్తించకపోవడం అంటే రాష్ట్ర ఆత్మను అవమానించడం" అని వ్యాఖ్యానించారు. ప్రెస్ మీట్ ముగింపు సందర్భంగా వీ శ్రీనివాస్ గౌడ్ మరోసారి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ "ఉద్యోగులు మన రాష్ట్ర వెన్నెముక. వారు సంతోషంగా ఉన్నప్పుడు రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వం వారి గళం వినాలి, లేకపోతే ప్రజా ఉద్యమం తప్పదు," అని ఘాటుగా అన్నారు.

## హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో ఫ్లైట్‌కు బాంబు బెదిరింపు.. ముంబైకి దారిమళ్లింపు

**హైదరాబాద్,నవంబర్01 (తెలంగాణ ముచ్చట్లు):**

బాంబు బెదిరింపు నేపథ్యంలో జెడ్డా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో విమానాన్ని దారి మళ్లించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేయకుండా ముంబైకి తీసుకెళ్లారు. అక్కడ సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్టు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎయిర్ పోర్టు అధికారులకు శనివారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఓ మెయిల్ వచ్చింది. ఆ మెయిల్‌లో 'జెడ్డా నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో ఫ్లైట్ 6E 68లో మానవ బాంబు ఉందని రాసి ఉంది. 1984లో మద్రాస్ ఎయిర్ పోర్టులో జరిగిన బాంబు దాడి తరహాలో ఈ దాడి జరుగుతుందని, ఎల్‌టీటీఈ, ఐఎస్ఐ ఈ దాడికి ప్లాన్ చేశాయని ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో ఎయిర్‌పోర్టు అధికారులు అప్రమత్తమయ్యారు. విమానం పైలెట్‌కు సమాచారం ఇచ్చారు. ముంబైలో ల్యాండ్ చేయాలని సూచించారు. ఇండిగో అధికార ప్రతినిధి ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు. 'నవంబర్ 1న ఇండిగో విమానం 6E 68కు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దాంతో జెడ్డా నుంచి హైదరాబాద్ రావాల్సిన విమానం ముంబై వెళ్లిపోయింది. ప్రోటాకాల్ ప్రకారం మేము సంబంధిత అధికారులకు విషయం చేరవేశామని, వారికి పూర్తిగా సహకరించి సెక్యూరిటీ చెక్స్ పూర్తి చేశామని పేర్కొన్నారు.

## వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

రైతులు పంట నష్టంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. వర్షాల ప్రభావం కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందకపోవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి వసుదేవరావు, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో బీజేపీ నేతలు రైతులకు ఆహారం, త్రాగునీరు, అవసరమైన సహాయం అందించేలా ఏర్పాట్లు చేశారు. రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వానికి తీసుకెళ్లి నిధుల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి పెట్టిస్తామని నల్లమాడ రామచందర్ రావు హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్ తోక కత్తిరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు: మాజీ మంత్రి కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)



రేవంత్ రెడ్డి ఏదో యుద్ధం చేసి గెలిచిన చక్రవర్తి అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే సంక్షేమ పథకాలను నిలిపేస్తానని ప్రజలను బెదిరించడం అంగీకార యోగ్యం కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నుండి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో టిడిపి జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ నాయుడు, ఇతర నాయకులు గులాబీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "రెండేళ్లలోనే రేవంత్ రెడ్డి పాలన రాష్ట్రాన్ని దారుణ స్థితికి చేర్చింది" అని ఆరోపించారు.ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు తప్పుడు హామీలతో మోసం చేస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. "ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పుడు ప్రజల మెడలో గొలుసులు కూడా లాక్కుంటున్నారు" అని విమర్శించారు. ఫ్రీ బస్ పథకం పేరిట భార్యల డబ్బును కూడా భర్తల జేబులో నుంచి వసూలు చేస్తున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కేటీఆర్ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, బీఆర్ఎస్ మళ్లీ ప్రజల నమ్మకం గెలుచుకుంటుందని నమ్మకంగా తెలిపారు.



## అక్రమ కేసులతో మహిళలను భయపెడుతున్నారు

### ప్రభుత్వంపై ధ్వజమెత్తిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్,నవంబర్01 (తెలంగాణ ముచ్చట్లు):**

తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు చేసే మహిళలపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. గతంలో భారత రాష్ట్ర సమితి చేసిన మాదిరిగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మహిళలను భయపెట్టేలా వ్యవహరిస్తోందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఎర్రగడ్డలో రాష్ట్ర భాజపా మహిళా మోర్చా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్‌లు మజ్లిస్‌కు వంగి సలాం కొడుతున్నాయి. హైదరాబాద్‌ను సింగపూర్, ఇస్తాంబుల్‌లా మారుస్తానని చెప్పిన కేసీఆర్ చివరికి ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. రెండు పడక గదుల ఇళ్ల పేరిట దగా చేశారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ నియోజకవర్గం తీవ్రమైన సమస్యల్లో ఉంది. కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు యువతకు రూ.4 వేలు, మహిళలకు రూ.2500, స్కూటీలు, తులం బంగారం, పావలా వడ్డీ రుణాలు ఏమయ్యాయి? మోసం చేసి మళ్లీ ఓట్ల కోసం వస్తున్న భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ నాయకులను మహిళలు నిలదీయాలి. బంగారు తెలంగాణ అని చెప్పిన కేసీఆర్ తన కుటుంబాన్ని మాత్రమే బంగారం చేసుకున్నారు. మహిళలు, రైతుల గురించి అనుక్షణం ఆలోచిస్తున్నది ప్రధాని మోదీ మాత్రమే. ప్రజల కోసం నిరంతరం ఆలోచించే భాజపాకు ఓటెయ్యాలి" అని ఆయన అభ్యర్థించారు. సమావేశంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, ఉపాధ్యక్షురాలు ఎస్.సునీత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ ఎర్రగడ్డ డివిజన్ ఇన్‌ఛార్జి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణ,కెనడా భాగస్వామ్యానికి బలమైన అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలపరిచే అంశాలపై, ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మా, ఏరోస్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలలో విస్తృత చర్చ జరిగింది. ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఆవిష్కరణాత్మక ప్రాజెక్టులు, మౌలిక వసతుల విస్తరణ, పరిశ్రమల ప్రోత్సాహక విధానాలను కెనడా పెట్టుబడిదారులు సమీక్షించి, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. పరిశ్రమలతోపాటు స్టార్టప్‌లు, విద్యా సంస్థలు, ఆధునిక సాంకేతిక కేంద్రాలపై కూడా పెట్టుబడులు పెట్టాలని ఆయన ఆహ్వానించారు.
కెనడా హైకమీషనర్ క్రిస్టోఫర్ కూటర్ తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని, రెండు దేశాల మధ్య సహకారం కొత్త దిశలో ముందుకు సాగుతోందని అభిప్రాయపడ్డారు. ఆయన భార్య కేరన్, కెనడా మంత్రి ఎడ్ జగర్, ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## బ్యాంకు ఖాతాదారులకు అలెర్ట్..
## నేటి నుంచి నిబంధనల్లో కీలక మార్పు..!

**హైదరాబాద్,నవంబర్01 (తెలంగాణ ముచ్చట్లు):** బ్యాంకు ఖాతాదారులకు అలెర్ట్. బ్యాంకు నిబంధనల్లో కీలక మార్పులు జరుగబోతున్నాయి. మారిన నిబంధనలు నేటి (నవంబర్ ఒకటి) నుంచి అమలులోకి వచ్చాయి. అమలులోకి రానున్నాయి. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంక్ అకౌంట్ల నామినీల విషయంలో కీలక మార్పులు చేసింది. ఇకపై నుంచి నలుగురు నామినీలను ఎంపిక చేసుకునే వీలు కల్పించింది. దాంతో బ్యాంకింగ్ సిస్టమ్‌లో క్లెయిమ్ సెటిల్‌మెంట్ మరింత సులభతరం కానున్నది. ఇందు కోసం కేంద్రం బ్యాంకింగ్ చట్టాలు (సవరణ) యాక్ట్‌లో మార్పులు చేసింది. బ్యాంకు నామినీలను నలుగురిని ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఉండడంతో ఖాతాదారులకు ఉపయోగకరంగా ఉండనున్నది. వాస్తవానికి గతంలో ఈ పరిమితి ఇద్దరికి మాత్రమే అవకాశం ఉండేది. తాజాగా నలుగురు నామినీలు కలిగి ఉండడంతో వ్యక్తులు వారి నిధులు, ఆస్తులపై ఎక్కువ నియంత్రణను కలిగి ఉండనున్నారు. ఈ చర్య క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభంగా, క్రమబద్ధీకరించడానికి కేంద్రం ఈ మార్పులు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం బ్యాంకులు.. నామినీ ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా రికార్డు చేయాల్సి ఉంటుంది. బ్యాంక్ ఖాతాదారుల నిధులను రక్షించేందుకు, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో త్వరిత క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను నిర్ధారించేందుకు ఈ మార్పును అమలులోకి తీసుకువస్తున్నది. ఇది బ్యాంక్ వ్యవస్థలో జవాబుదారీతనం పెంచుతుంది. స్పష్టమైన సమాచార నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తుంది.






## బీసీ రిజర్వేషన్ల అమలుకు బాపూ ఘాట్‌లో ప్రార్థన సభ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగం కల్పించిన హక్కులను సమానంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. బీసీలకు సముచిత రిజర్వేషన్లు ఇవ్వకపోతే సమాజంలో అసమానతలు మరింత పెరుగుతాయని ఆయన హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉందని, ప్రజా పోరాటాల ద్వారా ఈ న్యాయాన్ని సాధించాలన్నారు. మాజీ ఎంపీ హనుమంతు రావు మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం కొనసాగుతున్న పోరాటం ఇప్పుడు మరింత బలపడుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల శాతం దృష్ట్యా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడం అన్యాయం అని అభిప్రాయపడ్డారు. ఈ ప్రశ్నను ప్రజా ఉద్యమంగా మలచాలని, అన్ని వర్గాలూ మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.బీసీ కమిషన్ ఛైర్మన్, సభ్యులు, వివిధ బీసీ సంఘాల నాయకులు, యువత, మహిళా ప్రతినిధులు పాల్గొని, రిజర్వేషన్ల పెంపు, అమలు వంటి అంశాలపై చర్చించారు. బీసీల సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే రాష్ట్ర అభివృద్ధికి పునాదిగా భావించాలని కమిషన్ సభ్యులు సూచించారు.బాపూ ఘాట్ పరిసరాలు "జై బీసీ" నినాదాలతో మార్మోగాయి. సామాజిక న్యాయం సాధనలో ఈ సభ మైలురాయిగా నిలవనుందని నిర్వాహకులు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక









# భవిష్యత్ నాయకులుగా సత్తా చాటే నారాయణ విద్యార్థులు

**సత్తుపల్లి, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

నారాయణ స్కూల్, సత్తుపల్లి శాఖలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థి క్యాబినెట్ ఇన్స్టాలేషన్ కార్యక్రమం శుక్రవారం పాఠశాల ఆవరణలో ఉత్సాహభరితంగా, అట్టహాసంగా జరిగింది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతా స్పృహ పెంపొందించాలనే లక్ష్యంతో ఈ వేడుకను పాఠశాల నిర్వహించింది.

ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా ఏజీఎం రాంకీ హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. నాయకత్వంలో నైతిక విలువల ప్రాధాన్యతను వివరించిన ఆయన, నాయకుడు అనేది కేవలం పదవి కాదు — కర్తవ్యబద్ధత, క్రమశిక్షణ, సేవా దృక్పథం సమ్మిళితం అని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథిగా ఆర్ఎస్టీ లక్ష్మపతి పాల్గొని విద్యార్థులు ధైర్యంగా ముందుకు సాగి బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డెప్యూటీ హెడ్స్, జూనియర్ హెడ్స్, క్లబ్ కెప్టెన్స్, హౌస్ ఇన్‌చార్జ్‌లుకు బ్యాడ్జ్‌లు అందజేసి అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. కొత్తగా నియమితులైన విద్యార్థి ప్రతినిధులు నిజాయితీగా, అంకితభావంతో తమ విధులు నిర్వర్తిస్తామని ప్రమాణం చేశారు.

కార్యక్రమంలో ఆర్ఐ క్రాంతి కుమార్, కోఆర్డినేటర్ ప్రవీణ్, వినోదలక్ష్మి, నీలిమ, అకాడమిక్ డీన్ రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్స్ రమ్య, అనూష, సాఫ్ట్‌స్కిల్ ట్రైనర్ యశ్వంత్, ఏఓ జగదీష్, పీఈటీ గోపిరాజు, బోధనా సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ రామ్ మూర్తి నూతన విద్యార్థి నేతలకు శుభాకాంక్షలు తెలుపుతూ, నాయకత్వం అనేది బాధ్యతతో కూడిన అవకాశం. మీరు క్రమశిక్షణతో ముందుకు సాగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలి అని సూచించారు. చివరగా విద్యార్థులు కృతజ్ఞతాభివందనం తెలిపారు. ఉత్సాహభరితమైన వాతావరణంలో కార్యక్రమం ముగిసింది.




# చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

- **ఆరు లక్షల విలువ గల 40 గ్రాముల బంగారు ఆభరణాలు,50 గ్రాముల వెండి ఆభరణాలు,56వేల నగదు స్వాధీనం.**

**హసన్ పర్తి,నవంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు)**

కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరదిలో రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగలను అరెస్టు చేసినట్లు కేయూసి సిఐ ఎస్. రవికుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, వాంకిడి, తేజిగూడ గ్రామానికి చెందిన విద్యార్థి సిండే అరుణ్ కుమార్ తండ్రి రామయ్య(25) వరంగల్ లో 2022 సంవత్సరంలో చదువు పూర్తి చేసుకుని సంవత్సరం వరకు ఇంటి వద్దనే ఉండి 2024 సంవత్సరంలో ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవడానికి హనుమకొండకు వచ్చి కొద్ది రోజులుగా గది అద్దెకు తీసుకొని ఉంటూ చదువుకునే క్రమంలో బెట్టింగ్ లకు బానిసై అప్పు ఎలా తీర్చాలో తెలియక దొంగతనాలు చేయడం ప్రారంభించాడని సీఐ తెలిపారు. ఈ క్రమంలో గోపాల్పూర్, భీమారం ఏరియాలలో తాళం వేసిన ఇంటిని గుర్తించి రాత్రి వేళలో తాళాలు పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు దొంగతనాలు చేస్తున్నాడని పేర్కొన్నారు. నిందితుడు సుమారు పది నేరాలు చేసినట్లు ఒప్పుకున్నాడని ఈ కేసులలో 40 గ్రాముల బంగారు ఆభరణాలు,50 గ్రాముల వెండి ఆభరణాలు, 56,400 రూపాయలు మొత్తం సుమారు 6 లక్షల రూపాయలు రికవరీ చేసినట్లు తెలిపారు.ఎవరైనా ఇళ్లకు తాళాలు వేసి ఊళ్ళకు వెళ్లేటప్పుడు పక్క ఇంటి వారికి గాని లోకల్ పోలీసుల కు గాని తెలుపాలని, ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ రవికుమార్ సూచించారు.వరుస దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాలు విసిరిన దొంగను చాలెంజ్ గా తీసుకొని ఇట్టి కేసులను తొందరగా చేదించిన కేయూసి ఎస్సైలు పి.శ్రీకాంత్,కె నవీన్ కుమార్, క్రైమ్ సిబ్బంది అహ్మద్ పాషా, రాజశేఖర్,జితేందర్,సిసిఎస్ వరంగల్ సిబ్బంది టీ.మధు,ఈ.చందు లను కేయూసీ సీఐ అభినందించారు.





# గాలి కుంటు టీకాలు తప్పనిసరి.. నిర్లక్ష్యం చేయొద్దు

- **జిల్లా పశువైద్య అధికారి.**

**సత్తుపల్లి, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మండల పరిధిలోని సిద్దారం, గౌరీగూడెం గ్రామాల్లో జరుగుతున్న ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ బోడేపూడి శ్రీనివాస్ రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడిరైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలి కుంటు వ్యాధి టీకాలు వేయించాలి. టీకాలు వేయించకపోతే వైరస్ సోకే ప్రమాదం ఉంటుంది. ఆవులు, ఎద్దులు గాలి కుంటు వ్యాధికి గురైతే పాల ఉత్పత్తి తగ్గి, పునరుత్పత్తి సామర్థ్యం దెబ్బతింటుంది అని హెచ్చరించారు. నాలుగు నెలలు దాటిన దూడలు, పశువులకు ఈ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలని సూచించారు. రైతులు ఈ ఉచిత టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నవంబర్ 13 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి డాక్టర్ చింతనిప్పు శశిదీప్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు వి. చైతన్య, డి. కరుణాకర్, వి. సాధిక్, ఎస్. కె. లాల్ బీ, ఓఎస్‌లు రాధా, మల్లికార్జున్, నాగేశ్వరరావు, శ్రీను, గోపాలమిత్ర సిబ్బంది రామకృష్ణ, సైదులు, విజయ్, రవి, శేషగిరి, చెన్నారావు, కిరణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల ఆరోగ్యం కోసం యువ డాక్టర్ల ముందడుగు ఎమ్మెల్యే

- **మర్రి రాజశేఖర్ రెడ్డి**

**మల్కాజ్‌గిరి, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని వాణి నగర్‌లో సంతోషి డెంటల్ హాస్పిటల్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి హాస్పిటల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో ప్రైవేట్ హాస్పిటల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. వాణి నగర్ మరియు పరిసర ప్రాంత ప్రజలకు ఈ హాస్పిటల్ ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణలో యువ వైద్యులు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సంతోషి, డాక్టర్ సిద్ధార్థ వర్మ కృష్ణ చావ్లి, ప్రవీణ్, కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# వేంసూరులో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం.!

- **రైతు సంక్షేమమే లక్ష్యం.**
- **ఎమ్మెల్యే మట్టా రాగమయి .**

**సత్తుపల్లి, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

రైతుల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలితంగా వేంసూరు మండలంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో వేంసూరు మేజర్ పంచాయతీ గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు.

రైతుల సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల ప్రకారం సన్న రకం వరి క్వింటాకు ₹2,389, దొడ్డు రకం వరి క్వింటాకు ₹2,369 చెల్లించనున్నట్లు తెలిపారు. అదనంగా సన్న రకానికి క్వింటాకు ₹500 బోనస్ అందించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నిజమైన మద్దతు ఇస్తోందని అన్నారు.

రైతుల సంక్షేమం పట్ల కట్టుబడి ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి కృషి వల్ల ఈ పథకం అమలు సాధ్యమైందని రాగమయి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ, ఎంపీడీఓ, వ్యవసాయ అధికారులు, ఏపీఎం, ఏఈఓలు, పోలీస్ అధికారులు, వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



# ప్రమాద బాధితుడిని పరామర్శించిన తుమ్మల యుగంధర్

**- సత్యనారాయణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష.**

**సత్తుపల్లి, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలో అక్టోబర్ 24న జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో గాయపడిన సత్తుపల్లి పట్టణానికి చెందిన మన్నేపల్లి సత్యనారాయణను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ శనివారం పరామర్శించారు.

హైదరాబాద్‌లోని డి.ఆర్.డి.ఓ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న సత్యనారాయణ అధికార పనిమీద హైదరాబాదు నుండి బెంగళూరు వెళ్తుండగా ఆయన ప్రయాణించిన బస్సు కర్నూలు సమీపంలో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆయనకు గాయాలు కాగా, అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పించుకున్నారు.

ఈ విషయం తెలుసుకున్న తుమ్మల యుగంధర్ స్వయంగా సత్యనారాయణ నివాసానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు రాజబాబు, విద్యాసంఘ నాయకులు నాయుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





# ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**పెద్దమందడి సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి**

**పెద్దమందడి,నవంబరు01(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలం పరిధిలోని జగత్ పల్లి, మణిగిల్ల, మోజర్ల, మదిగట్ల గ్రామాల్లో శనివారం వరి కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి మార్కెట్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి తో కలిసి ప్రారంభించారు.

సింగిల్ విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభంతో రైతులు తమ పంటను కేంద్రాల వద్ద విక్రయించి, మధ్యవర్తులపై ఆధారపడకుండా న్యాయమైన ధర పొందవచ్చని అన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా మండలంలో వరి సేకరణ సులభతరం అవుతుంది, రైతులకు ఆర్థిక సౌకర్యం కలుగుతుంది అని అన్నారు. రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, పెద్దమందడి మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు విట్టా శ్రీనివాస్ రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ జగదీశ్వర్ రెడ్డి, పి.ఎ.సి.ఎస్ ఉపాధ్యక్షులు బిట్లీ కుమార్ యాదవ్, మాజీ ఎంపీటీసీ చాపల సత్యారెడ్డి,మాజీ సర్పంచ్ పుట్టమోని నారాయణ,రాములు గౌడ్, విజయ్ గౌడ్, హరి చందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రఘుమారెడ్డి,రమేష్ యాదవ్,ఏవో చెన్నారాయుడు, సొసైటీ ఇంచార్జీలు పంతుల శివ రెడ్డి, అరవింద్ చారి,బాలస్వామి రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## హరీష్ రావును పరామర్శించిన మంత్రి తుమ్మల

**సత్తుపల్లి, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

ఇటీవల మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి మరణించడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగి పోయింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల హరీష్ రావు నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. తండ్రి కోల్పోవడం కుటుంబానికి భర్తీ కాని లోటు అని తెలిపారు. తండ్రి స్ఫూర్తితో హరీష్ రావు ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



## పెద్దమందడి నూతన ఎంపీడీవో పరిణతను కలిసిన కాంగ్రెస్ మండల నాయకులు

**పెద్దమందడి,నవంబరు01 (తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండల ప్రజా పరిషత్‌కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో పరిణత ను శనివారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు శాలువాతో సన్మానించి, ఎంపీడీవోను అభినందించారు.

కాంగ్రెస్ నేతలు ఎంపీడీవోని మండల అభివృద్ధికి సహకరించాలని, వివిధ గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండి, తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని అభ్యర్థించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేతల్లో చీకరు చెట్టు తాండ గ్రామ మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, పామిరెడ్డిపల్లి గ్రామకు చెందిన మధిర శ్రీశైలం, చిన్న మందడి గ్రామానికి చెందిన వాకిటి రవి, ఎంపీడీవో సిబ్బందిలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు ఉన్నారు.



## ఓయూలో మంత్రి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలు

**నాచారం, నవంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఓయూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఓయూ బీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ, "బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వాకిటి శ్రీహరి. బీసీ వర్గాల కోసం 42% రిజర్వేషన్లు అమలు చేయడానికి ఆయనకు భగవంతుడు మరింత శక్తి, సామర్థ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నాం. రెండు కోట్లకుపైగా బీసీ ప్రజల ఆశీర్వాదం, అండ ఆయనతో ఉంది" అని పేర్కొన్నారు. బలహీన వర్గాల తరపున బలమైన స్వరంగా నిలుస్తూ ముందుకు సాగాలని కోరుకుంటున్నామని తెలిపారు.కార్యక్రమంలో రెడ్డి శ్రీనివాస్ ముదిరాజ్, బొల్లేపల్లి స్వామి గౌడ్, అల్లుడు జగన్ ముదిరాజ్, బైరు నాగరాజు గౌడ్, భీమ్ రావు, కొమ్మానబోయిన సైదులు, కాంపాటి వెంకట్ గౌడ్, శ్రీకాంత్, తిమ్మానగరం వెంకట్, రఘు, చేర్యాల వంశీ, కౌశిక్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## నవంబర్ 3లోగా పోస్ట్ మెట్రిక్ దరఖాస్తుల-లో తలెత్తిన సమస్యలు పరిష్కరించాలి....

- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జ్యోతి
- **ఖమ్మం బ్యూరో, నవంబర్ -1, తెలంగాణ ముచ్చట్లు;**

నవంబర్ 3 లోగా పోస్ట్ మెట్రిక్ దరఖాస్తులలో తలెత్తిన సమస్యలు పరిష్కరించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే ఎస్సీ విద్యార్థిని, విద్యార్థులకు 202425 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు మంజూరులో తలెత్తుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించవలసిందిగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఆధార్ నంబరు బ్యాంకు ఖాతాకు లింక్ లేకపోవడం, కాలేజీలో ఫస్ట్ లెవెల్ వెరిఫికేషన్ పూర్తికాని దరఖాస్తులు ఇంకా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ డిజిటల్ కి ద్వారా ఫార్వర్డ్ చేయని దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నట్లు అన్నారు. సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, అన్ని పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా ఈ పాస్ పోర్టల్ లో పూర్తి చేయాలని, ఈ ప్రక్రియ మొత్తం నవంబర్ 3 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు తమ ప్రస్తుత బ్యాంకు ఖాతాలో ఆధార్ సీడింగ్ సమస్యలు ఎదుర్కొంటున్నట్లయితే, వారికి పోస్టాఫీస్ లో కొత్తగా అకౌంట్ ఓపెన్ చేయమని సూచించాలని, పోస్టాఫీస్ అకౌంట్ ఆధార్ లింక్ అయిన తర్వాత, ఆ వివరాలు ఈ పాస్ పోర్టల్ లో ఆటోమేటిక్ గా అప్ డేట్ అవుతాయని, కాబట్టి విద్యార్థులు వెబ్ సైట్ లో స్వయంగా అప్ డేట్ చేయాల్సిన అవసరం లేదని అన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలల ప్రిన్సిపాల్ లు పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా జిల్లా కార్యాలయానికి డిజిటల్ కీ ద్వారా సమర్పించాలని, ఈ విషయంలో ఏవైనా నిర్లక్ష్యం, అనాసక్తి లేదా ఆలస్యం జరిగితే, సంబంధిత ప్రిన్సిపాల్ విద్యార్థుల స్కాలర్షిప్ మంజూరులో ఆలస్యం లేదా తిరస్కరణకు వ్యక్తిగతంగా బాధ్యత వహించవలసి ఉంటుందని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.






# సింగరేణి సత్తుపల్లికి కొత్త ఊపు.!

- ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న జిఎం పదవికి నియామకం.
- కార్యాలయంలో చింతల శ్రీనివాస్ చేరిక.

**సత్తుపల్లి, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

ఎదురుచూపులు ముగిశాయి. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న సత్తుపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ పదవికి నియామకం జరిగింది. సింగరేణి సంస్థ చైర్మన్ బలరాం ఉత్తర్వులతో చింతల శ్రీనివాస్‌ను సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా నియమించారు. శనివారం ఆయన సత్తుపల్లి ఏరియా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జలగం వెంగళరావు, కిష్టారం గనుల సిబ్బంది, అధికారులు చింతల శ్రీనివాస్‌కు సాదర స్వాగతం పలికారు. అనంతరం జే.వి.ఆర్ ఓసి పరిధిలోని అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన సత్తుపల్లి ఏరియాను అధికారులు, కార్మికులు కలిసి శ్రమించి అభివృద్ధి దిశగా తీసుకెళ్లాం. యూనియన్ నాయకుల సూచనలు స్వీకరించి, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తాను అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కిష్టారం ఓసి ప్రాజెక్టు అధికారి నరసింహారావు, జే.వి.ఆర్ ఓసి సీఓఎం రాజేశ్వరరావు, పిఈ శ్రీనివాస్, మేనేజర్ కళ్యాణరామ్, సి.హెచ్.పి ఇన్‌చార్జి సోమశేఖర్, కిష్టారం ఓసి మేనేజర్ రామకృష్ణ, సంక్షేమ అధికారులు దేవదాసు, శ్రీనివాస్, యూనియన్ నాయకులు సముద్రాల సుధాకర్, ఎం.డి. రజాక్, తీగల క్రాంతి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.





# నియోజకవర్గంలో పంట నష్టం పై సమీక్షా సమావేశం.!

- మొందా తుఫాన్ ప్రభావం.
- రైతుల సమస్యలపై చర్చ.

**సత్తుపల్లి, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆధ్వర్యంలో శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు, సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల వ్యవసాయ అధికారులు (ఏఓలు), సహాయక వ్యవసాయ అధికారులు (ఏఈఓలు) పాల్గొన్నారు. మొందా తుఫాన్ ప్రభావం వలన తీవ్రంగా నష్టపోయిన పంట పొలాలను స్వయంగా పరిశీలించి, రైతుల సమస్యలను అర్థం చేసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల ఏఓలు, ఏఈఓలు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందుగానే అవసరమైన ఏర్పాట్లు చేయాలని, గత సీజన్‌లో చోటు చేసుకున్న సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రైతుల పక్షాన పలు అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించబడింది. సత్తుపల్లి నియోజకవర్గ పరిస్థితులపై పూర్తి నివేదికను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రికి పంపించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.





# చర్లపల్లిలో సి.సి. రోడ్డు పనుల పరిశీలన

- అభివృద్ధి పనులపై నేతల సమీక్ష

**చర్లపల్లి, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా చర్లపల్లి గ్రామంలో జరుగుతున్న సి.సి రోడ్డు నిర్మాణ పనులను బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నేమూరీ మహేష్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. బంగారు మైసమ్మ దేవాలయం వద్ద ప్రారంభమైన ఈ రోడ్డు పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు సులభ రవాణా సౌకర్యం కలుగుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ, “చర్లపల్లి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజ్, విద్యుత్, నీటి సరఫరా వంటి పౌర వినియోగ సౌకర్యాల అభివృద్ధికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషి చేస్తున్నారు. ప్రాంతీయ ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా పనులు చేపడుతున్నారు. గ్రామ, డివిజన్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు కూడా త్వరలోనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం” అని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పనుల నాణ్యతలో ఎలాంటి రాజీపడబోమని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు, నేతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, లక్ష్మయ్య, బాబు, రాములు, అనిల్‌కుమార్, బాలకృష్ణ, శ్రీనివాస్, భాను, వంశీ తదితరులు పాల్గొన్నారు.





# మర్రిగూడాలో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**మల్లాపూర్, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మర్రిగూడా కాలనీలో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీలో డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రైల్వే ట్రాక్ పక్కన ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్ సమస్యతో పాటు ఎన్ఎఫ్‌సీ నుంచి వచ్చే కలుషిత మురుగు నీటి సమస్యను స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రైల్వే మరియు ఎన్ఎఫ్‌సీ అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, జలమండలి మేనేజర్ వేణుగోపాల్, వంగేటి సంజీవ రెడ్డి, పెద్ది సంజీవ రెడ్డి, బాల్ రెడ్డి, నరేష్, అంజిరెడ్డి, బోదసు లక్ష్మీనారాయణ, తండా వాసుగౌడ్, తిగుళ్ల శ్రీనివాస్, నాగరం బాబు, అల్లాడి కృష్ణయాదవ్, చిన్న దుర్గయ్య, నాగేందర్, దీపక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ల మరమ్మత్తుకు టెండర్లు దాఖలు చేయాలి....

◆ అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

ఖమ్మం బ్యూరో, నవంబర్ 01, తెలంగాణ ముచ్చట్లు;

జిల్లాలోని 84 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్స్ మరమ్మత్తు కొరకు ఆసక్తి గల వారు నవంబర్ 6 లోపు టెండర్లు దాఖలు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఉన్న 84 ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్స్ కు మరమ్మత్తులు చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుండి టెండర్లు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. కంప్యూటర్ మరమ్మత్తుల నిమిత్తం 69 ఉన్నత పాఠశాలలకు 15 వేల రూపాయలు చొప్పున, 15 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 5 వేల రూపాయల చొప్పున మొత్తం 11 లక్షల పదివేల రూపాయలు కేటాయించడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు.



ఆసక్తి గల ఖమ్మం జిల్లాకు చెందిన అభ్యర్థులు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో 4 వేల రూపాయలు చెల్లించి దరఖాస్తు తీసుకుని, 50 వేల రూపాయలు జిల్లా కలెక్టర్, చైర్మన్, సమగ్ర శిక్షా, ఖమ్మం పేరిట డీడీ తీసి నవంబర్ 3 నుంచి నవంబర్ 6 సాయంత్రం 5.00 గంటల వరకు టెండర్లు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దాఖలు చేయాలని అన్నారు. గడువు దాటిన పిదప వచ్చిన టెండర్లు, తపాల ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించడం జరగదని అన్నారు. సీల్డ్ కవర్ టెండర్లను నవంబర్ 8న ఉదయం 11.00 గంటలకు అదనపు కలెక్టర్ సమక్షంలో తెరిచి ఫైనల్ చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.





# ఉల్లాసంగా ఉత్సాహంగా స్మార్ట్ కిడ్జ్ వన సమారాధన

◆ చిన్నారుల నృత్యాలతో హోరెత్తిన వన ప్రాంగణం
◆ ఆకట్టుకున్న మ్యాజిక్ షో

ఖమ్మం బ్యూరో ,నవంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:

ఉరకలేసే ఉత్సాహంతో స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు స్థానిక చెరుకూరి మామిడి తోటలో శనివారం నిర్వహించిన కార్తీక మాస వన సమారాధన అందరిలో ఉల్లాసాన్ని నింపింది. నృత్యాలతో వన ప్రాంగణం హోరెత్తింది. సంతోషంగా చిన్నారులు నిర్వహించిన పలు రకాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రోజంతా పాఠశాల చిన్నారులు వనంలో గడిపి స్నేహ బంధాన్ని చాటారు. పుస్తకాలతో బిజీబిజీగా రోజుల తరబడి కాలం గడుపుతున్న పాఠశాల చిన్నారులకు ఆటవిడుపుగా నిర్వహించిన వన సమారాధన విద్యార్థులలో మరింత హుషారుని నింపింది. అల్లరి చేస్తూ, కేకలేస్తూ ఒకరికొకరు ఆత్మీయంగా పలకరిస్తూ చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. జానపద, సాంప్రదాయ, పాశ్చాత్య నృత్యాలతో వన ప్రాంగణ వేదికపై తోటి మిత్రులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మ్యాజిక్ కళాకారులు నిర్వహించిన మ్యాజిక్ ప్రదర్శన అందరిలో సంభ్రమాశ్చర్యాలను నింపింది. తమ కళ్ళముందే పలు రకాల వస్తువులు మాయమై కొత్త వస్తువులు దర్శనం ఇవ్వడం విద్యార్థులను మరింతగా అబ్బురపరిచింది. ఈ సందర్భంగా వన ప్రాంగణ వేదికపై పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ వనాలు మనం జీవించడానికి ప్రాణవాయువును అందిస్తున్నాయని అందుకే చెట్లను దేవతలుగా భావించి పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వన సమారాధనతో విద్యార్థులలో స్నేహబంధం, సహకారం, ఇతరుల పట్ల సంఘీభావం, ఆటపాటల విన్యాసాలు ప్రతి ఒక్కరికి పొంగే ఉత్సాహాన్ని అందిస్తున్నాయని తెలిపారు. రోజుల తరబడి పాఠశాలలో పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఆటవిడుపుగా కార్తీక వన సమారాధన నిర్వహించడం ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో సాంప్రదాయంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.





# మధిర లోతట్టు ప్రాంతాల వరద ముంపు శాశ్వత పరిష్కారానికి చర్యలు..

–జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం బ్యూరో, నవంబర్ -1, తెలంగాణ ముచ్చట్లు; వర్ష ప్రభావంతో వరద చేరే లోతట్టు ప్రాంతాల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి శాశ్వత పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు మధిర పట్టణం మున్సిపాలిటీ పరిధిలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. వర్షం కురిసినప్పుడు జలమయం అయ్యే కాలనీలు, వరద ఇబ్బంది పడే లోతట్టు ప్రాంతాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. మధిర మున్సిపాలిటీలోని హనుమాన్ నగర్, ముస్లిం కాలనీ లను క్షేత్రస్థాయిలో కాలినడకన తిరిగుతూ వరద ప్రభావ పరిస్థితులను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల వరద ముంపుకు శాశ్వతంగా సమస్యలు పరిష్కారానికి టౌన్ మ్యాప్ లను పరిశీలిస్తూ అధికారులకు అదేశాలు ఇచ్చారు. స్థానిక ప్రజలతో కలెక్టర్ మాట్లాడి, వర్షం తో జరిగే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, రోడ్డు వెడల్పు పెంచాలని ప్రజలందరూ దీనికి సహకరిస్తే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. అనంతరం మధిర మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్ ఆర్&బీ, మున్సిపల్ అధికారులతో పట్టణ అభివృద్ధి పనులు, శానిటేషన్, వరద లోతట్టు ప్రాంతాల పరిరక్షణ పై కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మధిర పెద్ద చెరువు బ్యాక్ వాటర్ ప్రభావం వలన లోతట్టు ప్రాంతాల వరద నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మధిర మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. మధిర పట్టణంలో చెత్తను పూర్తిగా డంపింగ్ యార్డ్ కు తరలించాలని, రహదారుల వెంట చెత్త కనిపించడానికి వీల్లేదని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మధిర పెద్ద చెరువు ట్యాంకుల ఏర్పాటు, పటిష్ట కాల్వర్టర్ల నిర్మాణం స్టార్మ్ వాటర్ సైడ్ డ్రైన్ లు నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వరద నీరు వెళ్లిపోవడానికి మున్సిపల్ అధికారులు రూపొందించిన డ్రైనేజీ ప్రణాళికలను సమీక్షించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ డిఇ నాగబ్రహ్మం, ఆర్&బీ డిఇ శంకర్, మధిర మండల తహసీల్దార్ రాంబాబు, మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

–రఘునాథ పాలెం సి ఐ ఉస్మాన్ షరీఫ్

ఖమ్మం బ్యూరో, నవంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు; ఖమ్మం జిల్లా రఘునాథ పాలెం లోని ఆపిల్ సెంటర్ లో ఈ రోజున ఖమ్మం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు ఖమ్మం టౌన్ ఏసీపీ పర్యవేక్షణలో వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఒక అనుమానస్పద వాహనంలోని ఇద్దరు వ్యక్తుల నుండి 30 లక్షల విలువ గల హషీష్ ఆయిల్ (గంజాయి ఆయిల్) ,వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించడం జరిగింది. ఈ కార్యక్రమం లో రఘునాథ పాలెం ఇన్స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ మరియు సబ్ ఇన్స్పెక్టర్ గజ్జెల నరేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# తుఫాను దెబ్బకు రోడ్డున పడ్డ కుటుంబం

వేలేరు, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు): వేలేరు మండలం పీచర గ్రామంలో తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఒక కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. చేటుకూరి లక్ష్మి (భర్త బుచ్చయ్య)కు చెందిన ఎకరం 20 గుంటల వరి పంట వరదల కారణంగా పూర్తిగా నాశనమైంది. పొలాల్లోకి వచ్చిన నీటితో పంట తడిసి నెలపాలైంది.

అదే సమయంలో వీరి పెంకుటిల్లు వర్షపు నీటికి చెదిరి కూలిపోయే స్థితికి చేరుకుంది. ప్రాణభయంతో లక్ష్మి కుటుంబం సమీప బంధువుల ఇంట్లో తలదాచుకోవాల్సి వచ్చింది.

గతంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తు చేసినప్పటికీ ఇల్లు కేటాయించలేదని బాధతో కన్నీరు పెట్టుకున్నారు. వెంటనే ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు స్పందించి పంట నష్టం పరిహారం మరియు గృహం మంజూరు చేయాలని బాధిత కుటుంబం కోరింది.



# అంగన్వాడీ సెంటర్లకు 8 నెలల కిరాయి బకాయిలు వెంటనే చెల్లించాలి

మల్కాజిగిరి, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు): మల్కాజిగిరి ప్రాంతంలోని వినాయక నగర్‌లో అంగన్వాడీ సిబ్బంది తమకు రావాల్సిన కిరాయిలు, కూరగాయలు, గ్యాస్ బిల్లులు చెల్లించాలంటూ నల్ల బ్యాడ్జీలు ధరించి శనివారం నిరసన తెలిపారు. అంగన్వాడీ టీచర్ల యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.జిల్లా కార్యదర్శి బి. శోభారాణి మాట్లాడుతూ,"మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో అంగన్వాడీ సెంటర్లకు ఎనిమిది నెలలుగా కిరాయిలు రాలేదు. ఇంటి యజమానులు సెంటర్లకు తాళం వేస్తామని హెచ్చరిస్తున్నారు. టీచర్లు తమ జీతాల నుంచి కూరగాయలు, గ్యాస్ ఖర్చులు భరించారు కానీ ప్రభుత్వం వైపు నుంచి ఇప్పటి వరకు చెల్లింపులు జరగలేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిసారీ అంగన్వాడీ సిబ్బందిపై ఒత్తిడి, బెదిరింపులు మాత్రమే చేస్తోందని ఆమె విమర్శించారు. ప్రభుత్వమే ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని ఆమె గుర్తుచేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్‌గా టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు జియో రాలేదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# డాక్టర్ ఏఎస్ రావు 22వ వర్ధంతి

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో నివాళులు

ఏ ఎస్ రావు నగర్, నవంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రముఖ శాస్త్రవేత్త, ఈసీఐఎల్ వ్యవస్థాపకుడు, పద్మభూషణ్ డాక్టర్ ఏఎస్ రావు 22వ వర్ధంతి సందర్భంగా కమలా నగర్ సిఐటియు కార్యాలయ ప్రాంగణంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గౌడుగు యాదగిరి రావు అధ్యక్షత వహించారు.డాక్టర్ ఏఎస్ రావు చిత్రపటానికి ఈసీఐఎల్ మాజీ ఉద్యోగులు ఎం. భాస్కర్‌రావు, జి. శివరామ కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్ఫూర్తి గ్రూప్ నాయకులు, ఈసీఐఎల్ మాజీ ఉద్యోగి జి. శివరామకృష్ణ మాట్లాడుతూ పేదరికంలో పుట్టి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న డాక్టర్ ఏఎస్ రావు ఉన్నత విద్య సాధించి భారతదేశానికి సేవ చేసిన గొప్ప శాస్త్రవేత్త అని పేర్కొన్నారు. వివక్షను ఎదుర్కొన్నప్పటికీ నిస్వార్థ సేవ, మానవతా భావంతో ముందుకు సాగిన వ్యక్తి ఆయన అన్నారు.అమెరికాలో విద్యను అభ్యసించినప్పటికీ దేశ సేవ కోసం తిరిగి వచ్చి డాక్టర్ హోమీ జే. బాబాతో కలిసి అణుశక్తి పరిశోధనల్లో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఈసీఐఎల్ పరిశ్రమలను నిర్మించడం ద్వారా వేలాది మందికి ఉద్యోగాలు, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధిని కల్పించిన మహనీయుడని అన్నారు .ఈ సందర్భంగా స్ఫూర్తి గ్రూప్ అధ్యక్షుడు గౌడుగు యాదగిరిరావు, నాయకులు ఉదయ భాస్కర్, భాస్కర్‌రావు ప్రసంగించారు.తరువాత సభ్యులంతా డాక్టర్ ఏఎస్ రావు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, ఉమామహేశ్వర రావు, శోభ, గౌసియా, బ్రహ్మం, ఆర్ఎస్ఆర్ ప్రసాద్, ప్లంబర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# తేనెలో జీడిపప్పు నానబెట్టి ఎప్పుడైనా తిన్నారా?

ఆరోగ్యానికి మేలు చేసే డ్రైఫ్రూట్స్‌లలో జీడిపప్పు ముఖ్యమైనది. అయితే కొందరు కొలెస్ట్రాల్ పెరుగుతుందని భయపడి వీటిని తినేందుకు విముఖత చూపుతున్నారు. వీటిల్లో ఉండే పాలీఅన్‌శాచ్యురేటెడ్, మోనోఅన్‌శాచ్యురేటెడ్ కొవ్వులు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, ఒంట్లో ట్రైగ్లిజరైడ్స్ పెరగకుండా, ఇతర దుష్ఫలితాలు తలెత్తకుండా కాపడుతాయని. జీడిపప్పు అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. అయితే కొందరు కొలెస్ట్రాల్ పెరుగుతుందని భయపడి వీటిని తినేందుకు విముఖత చూపుతున్నారు. నిజానికి, జీడిపప్పు గుండెకు చేసే మేలు మరే ఇతర డ్రైఫ్రూట్స్ కూడా చేయవని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. వీటిల్లో ఉండే పాలీఅన్‌శాచ్యురేటెడ్, మోనోఅన్‌శాచ్యురేటెడ్ కొవ్వులు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, ఒంట్లో ట్రైగ్లిజరైడ్స్ పెరగకుండా, ఇతర దుష్ఫలితాలు తలెత్తకుండా కాపడుతాయని చెబుతున్నారు. దీంతో గుండె జబ్బులు రాకుండానూ నిరోధించవచ్చు. వీటిల్లో ఎక్కువగా ఉండే మెగ్నీషియం కూడా గుండెకు ఎంతో మేలు చేస్తుంది. అయితే మనలో చాలా మందికి జీడిపప్పును వేయించుకుని.. దానిపై లైట్‌గా చాట్ మసాలా చల్లి కాస్త ఉప్పగా, కారంగా వీటిని తినడం అలవాటు. అలాగే కొందరికి పంచదారతో లేదంటే బెల్లంతో పాకం పట్టి అందులో కలిపి వీటిని తింటుంటారు. అయితే.. మీకు తెలుసా? తేనెలో జీడిపప్పు నానబెట్టి తినడం వల్ల ఆరోగ్యానికి బోలెడన్ని లాభాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు ముఖ్యంగా ప్రతి సీజన్లో వచ్చే వ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని కాపడటంలో జీడిలోని సుగుణాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. తేనెలో జీడిపప్పు నానబెట్టి తీసుకోవడం వల్ల వీటిలోని కాల్షియం, సోడియం, విటమిన్ సి, విటమిన్ బి, విటమిన్ కె, మెగ్నీషియం, పొటాషియం, జింక్, ఐరన్, ప్రోటీన్స్, యాంటీఆక్సిడెంట్స్ వంటివి సమృద్ధిగా శరీరానికి అందుతాయి. ఇక తేనె గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. బరువు తగ్గడం నుంచి డిప్రెషన్ ఆపడం వరకు ఎన్నో రకాలుగా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రకృతి ప్రసాధించిన సహజ తేనెలో జీడిపప్పు నానబెట్టి తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పుల నుంచి చక్కని ఉపశమనం లభిస్తుంది. అలాగే కంటి సంబంధిత సమస్యలు కూడా దరిచేరవు. రక్తహీనత సమస్యతో బాధపడుతున్న వారికి ఇది మంచి ఎంపిక. మెదడు కూడా చురుగ్గా పనిచేస్తుంది. చెడు కొలెస్ట్రాల్ తగ్గించి గుండె ఆరోగ్యంగా పనిచేసేలా చేస్తుంది. అయితే తేనెలో నానబెట్టిన జీడిపప్పు మితంగా తింటేనే అది అమృతంలా పనిచేస్తుంది. ఎందుకంటే ఇందులో అధిక కేలరీలు ఉంటాయి. రుచిగా ఉందికదాని అపరిమితంగా తీసుకుంటే మొదటికే మోసం వస్తుంది. కాబట్టి రోజుకు ఒక స్పూన్ చొప్పున తీసుకుంటే మంచి ఫలితాలు పొందొచ్చు.



# ఇవి తింటే ఎముకలకు తిరుగుండదు.. మస్తు బలంగా ఉంటాయి..!

మన ఎముకలు బలంగా ఉండాలంటే మనం తినే ఆహారంలో సరైన పోషకాలు ఉండాలి. ముఖ్యంగా కాల్షియం, ఫాస్పరస్, విటమిన్ డి వంటివి ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ఈ పోషకాలు లేకపోతే ఎముకలు బలహీనంగా మారి నొప్పిగా ఉంటాయి. ఒక్కోసారి విరిగిపోయే ప్రమాదం కూడా ఉంది. అందుకే ప్రతిరోజు ఈ పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలి. గుడ్లలో విటమిన్ డి చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ విటమిన్ మన శరీరం కాల్షియంను బాగా గ్రహించడానికి సహాయపడుతుంది. విటమిన్ డి ఉండటం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. గుడ్లు తినడం వల్ల ఎముకలకు కావలసిన కాల్షియం కూడా అందుతుంది. అందుకే ప్రతిరోజు గుడ్లు తింటే ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి.బాదం, చియా గింజలు, నువ్వులు వంటి నట్స్‌లో కాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలు బలంగా ఉండటానికి సహాయపడతాయి. వీటిని తరచుగా తినడం వల్ల ఎముకలు దృఢంగా తయారవుతాయి. అంతేకాకుండా ఇవి మన శరీరానికి రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి.పప్పులలో కాల్షియం, మెగ్నీషియం, జింక్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి ఎముకలకు కావలసిన బలాన్ని ఇస్తాయి. మనం పప్పులు తింటే ఎముకలు బలంగా తయారవుతాయి. ఎముకలకు సంబంధించిన చాలా సమస్యలు ఈ ఆహారం వల్ల తగ్గిపోతాయి. పాలు, పెరుగు, చీజ్ వంటి పాల ఉత్పత్తుల్లో కాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇవి మన శరీరానికి కావలసిన విటమిన్ డి ని కూడా అందిస్తాయి. దీనివల్ల ఎముకలు బలహీనంగా మారడం తగ్గుతుంది. ఎముకలు బలంగా, ఆరోగ్యంగా ఉండటానికి ప్రతి వయసులోనూ ఈ ఉత్పత్తులు తీసుకోవడం మంచిది. సాల్మన్, ట్యూనా వంటి కొవ్వు చేపల్లో విటమిన్ డి, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. వీటిని తినడం వల్ల ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరంలో వాపులు తగ్గి ఎముకలు బలంగా తయారవుతాయి.ఆకుకూరలు తింటే మన ఎముకలకు కావలసిన విటమిన్లు, కాల్షియం అందుతాయి. వీటిని ఎక్కువగా తింటే ఎముకలు బలంగా ఉంటాయి. ఎముకలు బలహీనంగా ఉండటం, నొప్పి వంటి సమస్యలు తగ్గి మనం ఆరోగ్యంగా ఉంటాము. బ్రోకలీలో కాల్షియం, విటమిన్ కె, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఎముకలు బలంగా ఉండటానికి.. శరీరంలో హాని చేసే పదార్థాలను తగ్గించడానికి సహాయపడతాయి. బ్రోకలీ తినడం వల్ల ఎముకలు దృఢంగా తయారవుతాయి. కొన్నిసార్లు మార్కెట్లో కాల్షియం, విటమిన్ డి కలిపిన ఆహారాలు కూడా దొరుకుతాయి. వీటిని తినడం వల్ల ఎముకలకు కావలసిన పోషకాలు అందుతాయి. ఈ ఆహారాలు ఎముకల సమస్యలు రాకుండా కాపాడతాయి. ఎముకల ఆరోగ్యం కోసం మనం తినే ఆహారం చాలా ముఖ్యం. ప్రతిరోజు సరైన పోషకాలు తీసుకోకపోతే ఎముకలు బలహీనమవుతాయి. కాబట్టి కాల్షియం, విటమిన్ డి వంటి పోషకాలు ఎక్కువగా ఉన్న ఆహారం



# ఈ జ్యూస్‌తో కడుపు నిండుగా.. బరువు తగ్గడం గ్యారెంటీ..!



వేసవి కాలంలో చాలా మంది బరువు తగ్గాలని అనుకుంటారు. ఈ సమయంలో మనం తినే ఆహారం, తాగే నీరు మన శరీరంలోని కొలెస్ట్రాల్ను తగ్గించి బరువును అదుపులో ఉంచడానికి సహాయపడతాయి. కొన్ని సహజమైన జ్యూస్ లు మన ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిని రోజూ తాగితే మన శరీరానికి ఒత్తిడి లేకుండా ఆరోగ్యంగా ఉంటుంది. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మన శరీరంలో జీవక్రియను పెంచి కొవ్వును కరిగించడానికి సహాయపడతాయి. ఉదయం ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగితే శరీరం తేలికగా చురుకుగా ఉంటుంది. అంతేకాకుండా శరీరానికి నీరు కూడా అందుతుంది.కీరదోస ఆకులు, పుదీనా ఆకులు, నిమ్మరసం కలిపి తాగితే వేసవి వేడిని తగ్గించడంతో పాటు శరీరం నిండుగా నీటితో ఉంటుంది. ఈ డ్రిరక్స్ చల్లగా ఉండి మనకు శక్తినిస్తాయి. బరువు తగ్గడానికి కూడా సహాయపడతాయి, శరీరం వేడిని తగ్గిస్తాయి.యాపిల్ సైడర్ వెనిగర్ను నీటిలో కలిపి రోజుకు ఒకసారి తాగడం వల్ల రక్తంలోని చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. ఇది ఆకలిని తగ్గిస్తుంది. దీనివల్ల మనం ఎక్కువ ఆహారం తీసుకోకుండా ఉంటాము. కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. బరువు తగ్గడం సులభం అవుతుంది.గ్రీన్ టీలో కెటాచిన్స్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి ఆరోగ్యాన్ని కాపాడుతాయి. వేసవిలో ఉదయం, సాయంత్రం గ్రీన్ టీ తాగడం బరువు తగ్గడానికి చాలా మంచిది. ఇది మన శరీరానికి శక్తిని కూడా ఇస్తుంది. చియా గింజల్లో ఎక్కువ ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. వీటిని నీటిలో నిమ్మరసం కలిపి తీసుకుంటే జీవక్రియ వేగంగా జరుగుతుంది. కొవ్వు కరిగి శరీరం తేలికగా అవుతుంది. అంతేకాకుండా పేగులు కూడా సరిగ్గా పని చేస్తాయి.పుచ్చకాయలో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి, నీరు ఎక్కువగా ఉంటుంది. దీని జ్యూస్ తాగితే మన శరీరం నిండుగా నీటితో ఉంటుంది. కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీనివల్ల మనం తక్కువ ఆహారం తింటాము. బరువు తగ్గడం సులభం అవుతుంది.అలోవెరా జ్యూస్ మన శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి బరువును అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. ఈ జ్యూస్ చర్మానికి కూడా చాలా మంచిది. కొబ్బరి నీళ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి, ఎలక్ట్రోలైట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇది మన శరీరాన్ని నిండుగా నీటితో ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది ఆకలిని నియంత్రించడానికి సహాయపడుతుంది. వేసవిలో దీన్ని తాగితే శరీరం చల్లగా, ఆరోగ్యంగా ఉంటుంది. వేసవి కాలంలో ఈ సహజ డ్రిరక్ లు తాగడం అలవాటు చేసుకుంటే మన శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. బరువు తగ్గడానికి ప్రయత్నించే వారికి కూడా ఈ డ్రిరక్ లు చాలా ఉపయోగకరంగా ఉంటాయి.

# పాలబువ్వ మీకూ ఇష్టమా..?

మిల్క్ రైస్ మీరెప్పుడైనా తిన్నారా? దీన్ని తయారు చేయడం కూడా చాలా సులభం. అందువల్ల రోజుకు కనీసం ఒక్కసారైనా పాలు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ పాలు, అన్నం మిక్స్ చేసి తినవచ్చు. ఆరోగ్యం బాగోలేనప్పుడు మాత్రమే చాలా మందికి పాలు తాగే అలవాటు ఉంటుంది. కానీ మీరు తెలుసుకోవాల్సిన ముఖ్య విషయం ఏమంటే.. మరిదేనిలోనూ లభించనంత పోషకాలు పాలల్లో మాత్రమే లభిస్తాయి. మిల్క్ రైస్ మీరెప్పుడైనా తిన్నారా? దీన్ని తయారు చేయడం కూడా చాలా సులభం. అందువల్ల రోజుకు కనీసం ఒక్కసారైనా పాలు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ పాలు, అన్నం మిక్స్ చేసి తినవచ్చు. కాబట్టి దీని ప్రయోజనాలు ఏమిటో? దీనిని ఎందుకు తినాలో? పాలు, అన్నం మిక్స్ చేసిన ఆహారం పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది.



శరీరానికి వివిధ ప్రయోజనాలను అందిస్తుంది. ఎందుకంటే పాలలో కాల్షియం, ప్రోటీన్, విటమిన్ డి, విటమిన్ బి12 ఉంటాయి. ఇవి ఎముకలు, దంతాలు, కండరాలు, నరాలను బలపరుస్తాయి. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి కూడా సహాయపడుతుంది. బియ్యంలో కార్బోహైడ్రేట్లు కూడా ఉంటాయి. ఇవి శక్తికి మూలం. ఈ రెండిరటినీ కలిపి తింటే, అవి మన శరీరానికి అవసరమైన అన్ని పోషకాలను అందిస్తాయి. సాధారణంగా పాలు, అన్నం శరీరానికి త్వరిత శక్తిని అందిస్తాయి. ముఖ్యంగా ఉదయం పూట వీటిని తీసుకోవడం వల్ల రోజంతటికి అవసరమైన శక్తి లభిస్తుంది. అదనంగా పాలు, అన్నం సులభంగా జీర్ణమవుతాయి. పాలు తీసుకోవడం వల్ల ఎలాంటి సమస్యలు లేకపోతే రోజూ తీసుకోవచ్చు. పాలు, అన్నం కలిపి తీసుకోవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండినట్లు అనిపిస్తుంది. ఇది అతిగా తినే ధోరణిని కూడా తగ్గిస్తుంది. పాలు తాగేటప్పుడు జీర్ణ సమస్యలు ఎదుర్కొనే వారు భోజనంలో పాలు, అన్నం కలిపి తినకూడదు. ఒకవేళ తినాల్సి వస్తే ముందుగా వైద్యుడిని సంప్రదించడం మంచిది. పాలు, అన్నం.. అధిక కేలరీలు కలిగిన ఆహారాలు. ఇవి బరువు పెరగడానికి కారణమవుతాయి. క్రమం తప్పకుండా తీసుకుంటే బరువు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి దీన్ని తినేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. అన్నింటికంటే ముఖ్యంగా పాల్ కలిపిన అన్నం తీసుకునే ముందు మీ శారీరక స్థితి, ఆహారాన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. అవసరమైతే వైద్య సలహా తీసుకోవాలి.

# చర్మంపై ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా..?

డయాబెటిస్ నేరుగా చర్మానికి సంబంధించినది. డయాబెటిస్ విషయంలో, ప్రారంభ లక్షణాలు చర్మంపై కనిపిస్తాయి. ఈ లక్షణాలలో చర్మంపై దురద, ఎర్రటి దద్దుర్లు ఉంటాయి. ఇది కాకుండా, చర్మంపై అనేక ఇతర తీవ్రమైన లక్షణాలు బయటపడతాయి. చర్మంపై ఏదైనా మార్పు కనిపిస్తే, చక్కెర స్థాయిని ఖచ్చితంగా తనిఖీ చేయాలి. ప్రపంచవ్యాప్తంగా డయాబెటిస్ కేసులు భారీగా పెరుగుతున్నాయి.. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా.. లక్షలాది మంది డయాబెటిస్ (మధుమేహం) వ్యాధి బారిన పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ వ్యాధి గురించి అవగాహనతో ఉండటం చాలా ముఖ్యం.. మధుమేహం అనేది రక్తంలో చక్కెర పరిమాణం చాలా ఎక్కువగా పెరగడం వల్ల సంభవించే దీర్ఘకాలిక వ్యాధి.. ఇది శరీరం అంతటా మీ రక్త నాళాలకు హాని కలిగించవచ్చు. అయితే.. మధుమేహం సాధారణ లక్షణాలు దాహం ఎక్కువగా వేయడం, తరచూ మూత్రవిసర్జన, అలసట, ఆకలి పెరగడం.. డయాబెటిస్ మీ శరీరాన్ని మాత్రమే కాకుండా దాని లక్షణాలు మీ చర్మంపై కూడా కనిపిస్తాయని




వైద్య నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా డయాబెటిస్ ప్రారంభ లక్షణాలు చర్మంపై కూడా కనిపిస్తాయి. జననేంద్రియాల చర్మంపై మొటిమలు దాని ప్రారంభ లక్షణంగా పరిగణిస్తారు. దీనితో పాటు, చర్మంపై ఏదైనా కోత లేదా గాయం మానడానికి ఎక్కువ సమయం తీసుకుంటే అది కూడా మధుమేహం వల్లే జరుగుతుంది. ఇది కాకుండా, మధుమేహానికి సంబంధించిన అనేక లక్షణాలు చర్మంపై కూడా బయటపడతాయి. ఈ లక్షణాలను గుర్తించిన తర్వాత, మీరు వెంటనే మీ చక్కెర స్థాయిని తనిఖీ చేసి చికిత్స ప్రారంభించాలి. ఈ రోజుల్లో డయాబెటిస్ అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతున్న వ్యాధి.. మారిన జీవనశైలి, చెడు ఆహారపు అలవాట్ల కారణంగా, ఈ వ్యాధి ఇప్పుడు యువతను కూడా ప్రభావితం చేస్తోంది. డయాబెటిస్ ఉన్నప్పుడు, దాని ప్రభావం చర్మంపై కూడా కనిపిస్తుంది. ఇందులో చర్మం పొడిబారడం, నల్లటి మచ్చలు, ఎర్రటి దద్దుర్లు, చర్మం నల్లగా మారడం కూడా ఉంటాయి. చర్మంపై అలాంటి మార్పు కనిపిస్తే, మీరు వెంటనే వైద్యుడిని సంప్రదించి డయాబెటిస్ కోసం తనిఖీ చేసుకోవాలి.

# ఆర్థిక అనిశ్చితి.. స్థిరాస్తి రంగంపై ప్రభావం!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలు, పలు దేశాల నడుమ యుద్ధాలు, ముడి చమురు, బంగారం ధరలు వంటి కారణాలతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి ఏర్పడింది. దీని ప్రభావం భారత స్థిరాస్తి రంగంపై పడింది. దేశీయ రియల్టీ రంగంలో విదేశీ పెట్టుబడులు భారీగా తగ్గాయని వెస్టియాన్ నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో దేశీయ రియల్టీలోకి 1.76 బిలియన్ డాలర్ల సంస్థాగత పెట్టుబడులు వచ్చాయి. అయితే 2025 క్యూ2లోని 1.80 బిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్లతో పోలిస్తే ఇది 2 శాతం తగ్గుదల కాగా.. గతేడాది క్యూ3లోని 0.96 బిలియన్ డాలర్ల ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్ట్‌మెంట్స్‌తో పోలిస్తే మాత్రం 83 శాతం అధికం. 2025 క్యూ3లోని సంస్థాగత పెట్టుబడులలో అత్యధికం వాణిజ్య సముదాయంలోకి వచ్చాయి. 79 శాతం వాటాతో ఈ విభాగంలోకి 1,397.21 మిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్స్ వచ్చాయి. ఇక, 11 శాతం




వాటాతో నివాస సముదాయంలోకి 191.67 మిలియన్ డాలర్లు, 5 శాతం వాటాతో పారిశ్రామిక, గిడ్డంగుల విభాగంలోకి 85.79 మిలియన్ డాలర్లు, 5 శాతం వాటాతో డైవర్సిఫైడ్ విభాగంలోకి 84.82 మిలియన్ డాలర్ల సంస్థాగత పెట్టుబడులు వచ్చాయి.

# మారుతి విక్టోరిస్.. 33వేల బుకింగ్స్

భారత ప్యాసింజర్ వాహన మార్కెట్లోకి ప్రవేశించిన.. మారుతి సుజుకి విక్టోరిస్ ఇప్పటి వరకు 33,000 కంటే ఎక్కువ బుకింగ్‌లను పొందింది. ఇందులో 30 శాతం కంటే ఎక్కువ బుకింగ్స్ సీఎన్‌జీ వేరియంట్ సొంతం చేసుకుంది. దీనికి కారణం బూట్ స్పేస్ అనే చెప్పాలి.

మారుతి సుజుకి తన విక్టోరిస్ కారులో.. సాధారణ కారులో అందించేంత బూట్ స్పేస్ అందిస్తోంది. ఇది CNG వేరియంట్ అమ్మకాలను పెంచడంలో దోహదపడిందని.. కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ పేర్కొన్నారు. విక్టోరిస్ సీఎన్‌జీ వేరియంట్‌లకు ఇప్పటి వరకు దాదాపు 11,000 బుకింగ్‌లు వచ్చాయని వెల్లడించారు.

మారుతి సుజుకి విక్టోరిస్.. మంచి డిజైన్, లేటెస్ట్ ఫీచర్స్ పొందుతుంది. ఈ కారు ధరలు రూ.10.50 లక్షల నుంచి రూ. 19.98 లక్షల మధ్య (ఎక్స్‌షోరూమ్) ఉంది. ఇది మొత్తం మూడు పవర్‌ట్రెయిన్ ఎంపికలతో లభిస్తుంది. ఇందులోని 1.5లీటర్ పెట్రోల్ ఇంజిన్ మైల్డ్ హైబ్రిడ్, స్ట్రాంగ్ హైబ్రిడ్, సీఎన్‌జీ టెక్నాలజీతో అందుబాటులో ఉంటుంది. ఇంజిన్ 5స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్, 6స్పీడ్ ఆటోమేటిక్ యూనిట్, ఈడవీటీ ట్రాన్స్‌మిషన్ ఎంపికలతో అందుబాటులో ఉంటుంది. మైల్డ్ హైబ్రిడ్ టెక్‌తో కూడిన 1.5లీటర్ ఇంజిన్ 5స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ & 6స్పీడ్ ఆటోమేటిక్ యూనిట్‌తో లభిస్తుంది. స్ట్రాంగ్ హైబ్రిడ్ వెర్షన్ ఈడవీటీ పొందుతుంది, పెట్రోల్‌సీఎన్‌జీ మోడల్ 5స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్‌తో వస్తుంది. ఇవన్నీ మంచి పనితీరును అందిస్తాయి.




# బ్యాంకు ఖాతాదారులకు అలెర్ట్.. నేటి నుంచి నిబంధనల్లో కీలక మార్పు..!

బ్యాంకు ఖాతాదారులకు అలెర్ట్. బ్యాంకు నిబంధనల్లో కీలక మార్పులు జరుగబోతున్నాయి. మారిన నిబంధనలు నేటి (నవంబర్ ఒకటి) నుంచి అమలులోకి వచ్చాయి. అమలులోకి రానున్నాయి. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంక్ అకౌంట్ల నామినీల విషయంలో కీలక మార్పులు చేసింది. ఇకపై నుంచి నలుగురు నామినీలను ఎంపిక చేసుకునే వీలు కల్పించింది. దాంతో బ్యాంకింగ్ సిస్టమ్‌లో క్లెయిమ్ సెటిల్‌మెంట్ మరింత సులభతరం కానున్నది. ఇందు కోసం కేంద్రం బ్యాంకింగ్ చట్టాలు (సవరణ) యాక్ట్‌లో మార్పులు చేసింది.





బ్యాంకు నామినీలను నలుగురిని ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఉండడంతో ఖాతాదారులకు ఉపయోగకరంగా ఉండనున్నది. వాస్తవానికి గతంలో ఈ పరిమితి ఇద్దరికి మాత్రమే అవకాశం ఉండేది. తాజాగా నలుగురు నామినీలు కలిగి ఉండడంతో వ్యక్తులు వారి నిధులు, ఆస్తులపై ఎక్కువ నియంత్రణను కలిగి ఉండనున్నారు. ఈ చర్య క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభంగా, క్రమబద్ధీకరించడానికి కేంద్రం ఈ మార్పులు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం బ్యాంకులు.. నామినీ ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా రికార్డు చేయాల్సి ఉంటుంది. బ్యాంక్ ఖాతాదారుల నిధులను రక్షించేందుకు, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో త్వరిత క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను నిర్ధారించేందుకు ఈ మార్పును అమలులోకి తీసుకువస్తున్నది. ఇది బ్యాంక్ వ్యవస్థలో జవాబుదారీతనం పెంచుతుంది. స్పష్టమైన సమాచార నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తుంది.

బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం2025 ప్రకారం.. బ్యాంకులు ప్రస్తుతం నలుగురు నామినీలను యాడ్ చేసేందుకు అనుమతి ఉంటుంది. వారి వివరాలు, ఈమెయల్ చిరునామా, ఫోన్ నంబర్లు కూడా అవసరమవుతాయి. ఈ నియమం బ్యాంకులలో త్వరిత, పారదర్శక క్లెయిమ్ పరిష్కారం లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళుతుంది. ఈ నియమాలను 2025 కి ముందు అమలు చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశించింది. బ్యాంకు ఖాతాదారులు వారి కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు, వారికి సంబంధించిన విశ్వసనీయ వ్యక్తులను నామినీలుగా ఎంచుకోవచ్చు. ఇది ఖాతాలో తలెత్తే ఏవైనా అనధికార క్లెయిమ్‌లు, వివాదాలను త్వరగా పరిష్కరించేందుకు వీలు ఉంటుంది. బహుళ బ్యాంకు ఖాతాలు కలిగి ఉన్నా.. లేదంటే వారి నిధులను రక్షించుకోవాలనుకునే ఖాతాదారులకు ఈ చర్య ప్రత్యేకంగా సహాయపడుతుంది. నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ నియమాలు బ్యాంకింగ్ రంగంలో ఎక్కువ పారదర్శకత, జవాబుదారీతనం, భద్రతను నిర్ధారించడమే లక్ష్యం. నలుగురు నామినీలను జోడించే సామర్థ్యం వారి ఆర్థిక ప్రణాళికను బలోపేతం చేస్తుంది. భవిష్యత్తులో వివాదాల సమస్యను తగ్గిస్తుంది.

# వినియోగదారులకు కాస్త ఉపశమనం.. తగ్గిన గ్యాస్ సిలిండర్ ధర

ధరల మోతతో ఇబ్బంది పడుతున్న గ్యాస్ వినియోగదారులకు దేశీయ చమురు సంస్థలు కాస్త ఉపశమనం కలిగించాయి. హోటల్స్, రెస్టారెంట్స్‌లో వినియోగించే కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరను తగ్గించాయి. 19 కిలోల LPG సిలిండర్ ధర రూ.5 రూపాయలు తగ్గిస్తున్నట్లు ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ప్రకటించాయి. తగ్గిన ధరలు ముంబై, కోల్‌కతా, హైదరాబాద్, చెన్నై సహా దేశవ్యాప్తంగా నేటి నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించాయి.

ప్రతి నెల 1వ తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సవరిస్తుంటాయి. అందులో భాగంగా ఇవాళ కూడా సవరించిన ధరలను ప్రకటించాయి. తాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,590.50 ఉంది. గతంలో ఇది రూ.1,595.50గా ఉండేది. ఇక కోల్‌కతాలో రూ.1,694, ముంబైలో రూ.1,542, చెన్నైలో రూ.1,750, హైదరాబాద్‌లో రూ.1,812.50గా ఉంది. అయితే, గృహ వినియోగం కోసం ఉపయోగించే 14.2 కిలోల సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు జరగలేదు. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో వంట గ్యాస్ ధర రూ.850 నుంచి రూ.960 మధ్య ఉంది.






## వరుసగా రెండోసారి.. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరల పెంపు..!

ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధర దాదాపు ఒక శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా నెలవారీ సమీక్షలో భాగంగా చమురు కంపెనీలు ఏటీఎఫ్ ధరలను సవరించాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు మార్కెటింగ్ కంపెనీల ప్రకారం.. దేశ రాజధాని ఢిల్లీలో ఏటీఎఫ్ ధర 0.8 శాతం పెరిగి కిలోలీటర్‌కు రూ.94,543.02కి చేరుకుంది. జెట్ ఇంధన ధరలు పెరుగడం ఇది వరుసగా రెండోసారి. గత నెల అక్టోబర్ 1న ఏటీఎఫ్ ధరలు దాదాపుగా రూ.3,052 పెరిగాయి. అంతకు ముందు సెప్టెంబర్‌లో కిలోలీటర్‌కు రూ.1,308.41 తగ్గింది. ఏటీఎఫ్ ధరల పెరుగుదలతో విమానయాన సంస్థలపై భారం పడనున్నది. వీటి నిర్వహణ ఖర్చుల్లో ఇంధనానికే దాదాపు 40శాతం ఉంటుంది. ఇక ముంబయిలో ఏటీఎఫ్ ధర కిలోలీటరుకు రూ.87,714.39 నుంచి 88,44.87కి చేరింది. వ్యాట్‌ను బట్టి నగరాల వారీగా ధరల్లో మార్పులు ఉంటాయి.

ఇదిలా ఉండగా.. చమురు కంపెనీలు వాణిజ్య సిలిండర్ ధరలను తగ్గించాయి. 19 కిలోల ఎల్‌పీసీ సిలిండర్ ధర రూ.5 తగ్గిస్తున్నట్లు ప్రభుత్వరంగ చమురు కంపెనీలు ప్రకటించాయి. తగ్గిన ధరలు నేటి నుంచి అమలులోకి వస్తాయని కంపెనీ తెలిపాయి. ప్రతి నెల ఒకటో తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సవరిస్తుంటాయి. అందులో భాగంగా ఇవాళ కూడా సవరించిన ధరలను ప్రకటించాయి. తాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,590.50 ఉంది. గతంలో ఇది రూ.1,595.50గా ఉండేది. ఇక కోల్‌కతాలో రూ.1,694, ముంబైలో రూ.1,542, చెన్నైలో రూ.1,750, హైదరాబాద్‌లో రూ.1,812.50గా ఉంది. అయితే, గృహ వినియోగం కోసం ఉపయోగించే 14.2 కిలోల సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో వంట గ్యాస్ ధర రూ.850 నుంచి రూ.960 మధ్య కొనసాగుతున్నాయి.




## అక్టోబర్‌లో రికార్డు స్థాయికి యూపీఐ లావాదేవీలు

పండుగ సీజన్ కావడంతో అక్టోబర్ నెలలో డిజిటల్ చెల్లింపులు సరికొత్త శిఖరాలకు చేరుకున్నాయి. ముఖ్యంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలు మునుపెన్నడూ లేనంతగా పెరిగి ఆల్‌టైమ్ రికార్డు లను సృష్టించాయి.

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. అక్టోబర్ నెలలో యూపీఐ ద్వారా జరిగిన లావాదేవీలు 20.70 బిలియన్లుగా నమోదైంది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 25 శాతం వృద్ధి నమోదైంది. విలువ పరంగా చూస్తే అక్టోబర్‌లో రూ.27.28 లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయి. ఇక రోజువారీ లావాదేవీల విలువ సగటున రూ.87,993 కోట్లుగా ఉంది (668 మిలియన్లు). ఇది గతేడాదితో పోలిస్తే 16 శాతం అధికం.

ఇక గతనెల యూపీఐ ద్వారా రూ.24.90 లక్షల కోట్ల లావాదేవీలు నమోదైన విషయం తెలిసిందే. సెప్టెంబర్‌లో రోజూవారీ లావాదేవీల విలువ సగటున రూ.82,991 కోట్లుగా (654 మిలియన్లు) ఉంది. 2016లో సాధారణంగా ప్రారంభమైన యూపీఐ చెల్లింపులు ఇప్పుడు తారాస్థాయికి చేరాయి. 2017 జూన్‌లో యూపీఐ లావాదేవీల రోజువారీ సగటు 3.5 లక్షలుగా ఉండగా.. ఈ ఏడాది అవి ఆల్‌టైమ్ రికార్డుకు చేరాయి.


## పెళ్లిళ్ల సీజన్: రూ.6.5 లక్షల కోట్ల బిజినెస్!

భారతదేశంలో పెళ్లిళ్ల సీజన్ మొదలైపోయింది. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 14 వరకు దేశంలో దాదాపు 48 లక్షల వివాహాలు జరుగుతాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ అంచనా. ఈ సీజన్‌లో సుమారు రూ. 6.5 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని తన నివేదికలో వెల్లడించింది.

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ తన పరిశోధన విభాగం సీఏఐటీ రీసెర్చ్ & ట్రేడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా విడుదల చేసిన నివేదికలో.. పెళ్లిళ్ల సీజన్ భారతదేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊరటను ఇవ్వనుంది. బంగారం, రత్నాలు, దుస్తులు, క్యాటరింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రానిక్, ట్రావెల్స్ & హాస్పిటాలిటీ, డెకరేషన్ మొదలైన రంగాల వ్యాపారాలు గణనీయంగా పెరుగుతాయని స్పష్టం చేసింది.

ఈ సంవత్సరం ఢిల్లీలో మాత్రమే 4.8 లక్షల వివాహాల ద్వారా రూ.1.8 లక్షల కోట్లు వ్యాపారం జరుగుతుందని అంచనా. గత సంవత్సరం ఇదే కాలంలో దేశంలో జరిగిన మొత్తం వివాహాల సంఖ్య సమానంగా ఉన్నప్పటికీ.. ఈసారి ఖర్చు మాత్రం గణనీయంగా పెరుగుతుంది. దీనికి కారణం వస్తువులు, బంగారు ఆభరణాల ధరలు పెరగడమే అని సెక్రటరీ జనరల్ అండ్ చాందినీ చౌక్ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ అన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# 35 ఏండ్ల తరువాత స్వగ్రామానికి మాజీ మావోయిస్టు పున్నం చందర్(రాజు)

## ఘన స్వాగతం పలికిన గ్రామస్థులు

## వనం వీడి... జనజీవనంలోకి

### ఆత్మీయ పలకరింపులతో ముందుకు సాగిన స్వాగత ర్యాలీ



**హనుమకొండ,నవంబర్ 01(తెలంగాణ ముచ్చట్లు):** దాదాపు 35 ఏళ్ల తర్వాత మాజీ మావోయిస్టు నేత పున్నంచందర్(రాజు) తన స్వగ్రామమైన ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి తిరిగి వచ్చాడు. ఇటీవలే హైదరాబాద్లో డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో జనజీవన స్రవంతిలో కలిసిన ఆయన శనివారం స్వగ్రామానికి చేరుకోవడంతో గ్రామం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. గ్రామస్తులు పూల దండలు, శాలువాలతో ఘన స్వాగతం పలికారు. చిన్ననాటి పాఠశాలను సందర్శించిన పున్నంచందర్ అక్కడ ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం పెద్దమ్మగుడిని దర్శించుకుని గ్రామ ప్రజలతో, బాల్య స్నేహితులతో సంభాషించారు.ఈ సందర్భంగా అందరిని ఆత్మీయంగా పలరిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.చిన్న వయసులో ఉద్యమ గీతాలకు ఆకర్షితుడై మావోయిజం వైపు మొగ్గు చూపిన పున్నం చందర్(రాజు) మూడున్నర దశాబ్దాల పాటు అజ్ఞాతంలో గడిపాడు. ప్రజానాట్య మండలి పాటల ద్వారా ఉద్యమంలో చేరిన



ఆయన పాలకుర్తి, నర్సంపేట దళ కమాండర్గా పనిచేశాడు. ప్రభుత్వం నిర్భందం పెరగడంతో దండకారణ్య ప్రాంతానికి బదిలీ అయ్యి, అక్కడే దీర్ఘకాలం గడిపాడు.ఈ సందర్భంగా పున్నంచందర్ మాట్లాడుతూ... "ఇన్నేళ్ల తర్వాత నా ఊరు, నా ప్రజలు, నా పాఠశాల చూసి హృదయం పొంగిపోయింది. ఇకపై సమాజ సేవలో భాగస్వామి అవుతా," అని పేర్కొన్నాడు. "నేను లొంగిపోలేదు_ _ _ ప్రజలతో కలిసి పనిచేయడానికే తిరిగి వచ్చాను. నా ఊరు, నా ప్రజలకోసమే చివరి శ్వాస వరకు బతుకుతాను," అని స్పష్టంగా చెప్పారు. సభలో ఆయన పాడిన ప్రజా గీతాలు గ్రామమంతా మార్మోగాయి.రాజు భార్య సోని మాట్లాడుతూ_ _ _. "మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుకు రావాలి," అని మహిళలకు పిలుపునిచ్చారు. పున్నంచందర్ స్వగ్రామానికి తిరిగి రావడంతో తాటికాయల గ్రామం ఆనందోత్సాహాలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి గంగా(సోనీ),మాజీ సర్పంచ్ పెసరు రమేష్, గ్రామస్థులు దుబాల బిక్షపతి,బొల్లెపాక నగేష్,ఎర్ర వెంకటస్వామి,శ్యామ్ సుందర్, సయ్యద్,వారి కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.



## ఎండిపోతున్న సింధూ బేసిన్..

# పాక్‌కు నీటి కొరత

సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో సింధూ జలాలపై పూర్తిగా ఆధారపడిన సింధూ బేసిన్ తీవ్ర నీటి కొరత ముప్పును ఎదుర్కొంటోందని సిడ్నీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పీస్ ప్రచురించిన ఓ నివేదిక వెల్లడించింది. ఒప్పందాన్ని నిలిపివేయడం ద్వారా పశ్చిమ పాకిస్థాన్ సరిహద్దుల్లోకి సింధూ జలాల ప్రవాహాన్ని భారత్ అడ్డుకోగలిగిందని నివేదిక పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడిని పురస్కరించుకుని పాకిస్థాన్‌తో గతంలో చేసుకున్న సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. పాకిస్థాన్‌లోని వ్యవసాయ రంగం సింధూ జలాలపై 80 శాతం ఆధారపడిన కారణంగా ఈ పరిణామంతో పాక్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లయింది.



# హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో ఫ్లైట్‌కు బాంబు బెదిరింపు..

బాంబు బెదిరింపు నేపథ్యంలో జెడ్డా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో విమానాన్ని దారి మళ్లించారు. హైదరాబాద్ ఎయిర్ పోర్టులో ల్యాండ్ చేయకుండా ముంబైకి తీసుకెళ్లారు. అక్కడ సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్టు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎయిర్ పోర్టు అధికారులకు శనివారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఓ మెయిల్ వచ్చింది. ఆ మెయిల్‌లో 'జెడ్డా నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో ఫ్లైట్ 6E 68లో మానవ బాంబు ఉందని రాసి ఉంది. 1984లో మద్రాస్ ఎయిర్ పోర్టులో జరిగిన బాంబు దాడి తరహాలో ఈ దాడి జరుగుతుందని, ఎల్‌టీటీఈ, ఐఎస్ఐ ఈ దాడికి ప్లాన్ చేశాయని ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో ఎయిర్‌పోర్టు అధికారులు అప్రమత్తమయ్యారు. విమానం పైలెట్‌కు సమాచారం ఇచ్చారు. ముంబైలో ల్యాండ్ చేయాలని సూచించారు. ఇండిగో అధికార ప్రతినిధి ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు.

'నవంబర్ 1న ఇండిగో విమానం 6E 68కు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దాంతో జెడ్డా నుంచి హైదరాబాద్ రావాల్సిన విమానం ముంబై వెళ్లిపోయింది. ప్రోటాకాల్ ప్రకారం మేము సంబంధిత అధికారులకు విషయం చేరవేశామని, వారికి పూర్తిగా సహకరించి సెక్యూరిటీ చెక్స్ పూర్తి చేశామని పేర్కొన్నారు.

# నక్సలిజం త్వరలోనే అంతం



దేశంలో నక్సలిజం పూర్తిగా అంతమయ్యే రోజు ఇక ఎంతో దూరంలో లేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. మావోయిస్టుల ప్రభావం ఇప్పటికే చాలా వరకు తగ్గిపోయిందని చెప్పారు. ఆయన శనివారం ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించారు. రూ.14,260 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్ అవతరించి 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో నవ రాయ్‌పూర్‌లో నిర్వహించిన 'రజత్ మహోత్సవ్'లో పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతి ప్రయాణం తనకు ఆనందం కలిగిస్తోందని అన్నారు. 25 ఏళ్ల క్రితం నాటిన విత్తనం ఇప్పుడు వటవృక్షంగా మారిందని ఉద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్ 25 ఏళ్ల ప్రయాణం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ఒకప్పుడు నక్సలైట్ల హింసాకాండకు, వెనుకబాటుతనానికి ప్రతీక అయిన రాష్ట్రం నేడు అభివృద్ధి, భద్రత, స్థిరత్వానికి మారుపేరుగా మారిందని హర్షం వ్యక్తంచేశారు. నక్సల్స్ హింసాకాండ నుంచి రాష్ట్రం విముక్తి పొందడం ఎంతో సంతృప్తినిస్తోందని తెలిపారు. మావోయిస్టుల సిద్ధాంతం వల్ల అధోగతే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు.

మావోయిస్టులు ఆయుధాలు వదిలేసి లొంగిపోతుండడం శుభపరిణామం అని అభివర్ణించారు. వారు భారత రాజ్యాంగం స్వీకరించి, శాంతి మార్గంలో నడుస్తున్నారని పేర్కొన్నారు. శాసనసభ అంటే కేవలం చట్టాలు చేసే వేదిక కాదని.. రాష్ట్ర భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దే మహోన్నత క్షేత్రమని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని నవ రాయ్‌పూర్ అటల్ నగర్‌లో రాష్ట్ర అసెంబ్లీ నూతన భవనాన్ని ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. అసెంబ్లీ ప్రాంగణంలోనే ఉన్న దివంగత ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని కూడా నరేంద్ర మోదీ ఆవిష్కరించారు.

రామచరిత మానస్ పఠనం

16వ శతాబ్దంలో తులసీదాస్ రచించిన రామచరిత మానస్‌లోని ఓ శ్లోకాన్ని ప్రధాని మోదీ పఠించారు. సుపరిపాలనకు శ్రీరాముడి ఆశయాలే నాంది అని తెలిపారు. 'అభివృద్ధి చెందిన భారత్' అనే దార్శనికతకు ఆయనే స్ఫూర్తి అని పేర్కొన్నారు. శ్రీరాముడి తల్లి జన్మస్థలం ఛత్తీస్‌గఢ్‌లోనే ఉందన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు రాముడు ప్రియమైన మేనల్లుడు అని వ్యాఖ్యానించారు. సామాజిక సామరస్యం, సమానత్వానికి శ్రీరాముడి ఆశయాలే పునాది అని ఉద్ఘాటించారు. సమాజంలో వివక్ష అంతం కావాలని, అందరికీ సామాజిక న్యాయం దక్కాలని అకాంక్షించారు. అంతర్జాతీయంగా ఎలాంటి సంక్షోభం తలెత్తినా మొదట భారత్ ప్రతిస్పందిస్తోందని ప్రధాన మంత్రి మోదీ తెలిపారు. బాధితులకు తగిన సాయం అందించేందుకు దేశం ముందుకు వస్తోందని అన్నారు.

# అభివృద్ధి కావాలా? అరాచకం కావాలా?



మోదీ-నితీశ్ కుమార్‌ల అభివృద్ధి అజెండా కావాలో లేక రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) జంగిల్‌రాజ్ కావాలో తేల్చుకోవాలని బిహార్ ప్రజలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టంచేశారు. అభివృద్ధి పట్టం కట్టాలా? లేక ఆటవిక రాజ్యం కావాలా? అనేది మన చేతుల్లోనే ఉందన్నారు. శనివారం బిహార్‌లో గోపాల్‌గంజ్, సమస్తీపూర్, వైశాలి జిల్లాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో అమిత్ షా వర్చువల్‌గా ప్రసంగించారు.

వాతవరణం అనుకూలించకపోవడంతో ఆయా ప్రాంతాలకు ఆయన చేరుకోలేకపోయారు. బిహార్ అభివృద్ధి బాధ్యతను ఎవరికి అప్పగించాలో నిర్ణయించడానికి ఈ ఎన్నికలు ఒక సువర్ణావకాశమని అమిత్ షా చెప్పారు. గతంలో ఆర్జేడీ పాలనలో ఎన్నో అకృత్యాలు జరిగాయని వెల్లడించారు. అప్పట్లో నక్సలైట్లు పెట్రేగిపోయారని, రక్తం ఏరులై పారిందని అన్నారు. భూస్వాముల ప్రైవేట్ సైన్యాలు ప్రజలపై పెత్తనం చెలాయించాయని గుర్తుచేశారు. ఆనాటి రాక్షస రాజ్యం మళ్లీ రావొద్దంటే ఆర్జేడీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతులు, మహిళల సంక్షేమానికి పెద్దపీట రాష్ట్రంలో ఎన్డీయేకు మరోసారి అధికారం కట్టబెడితే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని అమిత్ షా హామీ ఇచ్చారు. రైతులు, మహిళల సంక్షేమానికి ఎన్డీయే మేనిఫెస్టోలో పెద్దపీట వేసినట్లు తెలిపారు. 1.41 కోట్ల మంది జీవికా దీదీల ఖాతాల్లోకి ఇటీవల ప్రభుత్వం రూ.10 వేల చొప్పున జమ చేసినట్లు చెప్పారు. మళ్లీ అధికారంలోకి వస్తే వారికి రూ.2 లక్షల దాకా ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. 27 లక్షల మంది రైతులకు ప్రతి ఏటా రూ.9,000 చొప్పున అందజేస్తామన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని చక్కెర కర్మాగారాలను మళ్లీ తెరిపిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై అమిత్ షా ఆగ్రహం వ్యక్తంచేశారు. చొరబాటుదారులను కాపాడేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ చేసిన ఓటర్ అధికార్ యాత్రను తప్పుపట్టారు. ఎవరు ఎన్ని యాత్రలు చేసినా చొరబాటుదారులను బయటకు పంపించడం తథ్యమని అమిత్ షా తేల్చిచెప్పారు.

# ఎన్డీయే నకిలీ జాతీయవాదాన్ని ప్రచారం చేస్తోంది : ప్రియాంకాగాంధీ



బీహార్ అసెంబ్లీ ఎన్నికల లో గెలిచేందుకు ఎన్డీయే సర్కారు విభజన రాజకీయాలకు పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆరోపించారు. నకిలీ జాతీయవాదం ను ప్రచారం చేస్తోందని విమర్శించారు.

సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించలేకనే ఓట్ల చోరీకి పాల్పడుతోందని బీజేపీపై మండిపడ్డారు. ఓట్ల తొలగింపు అనేది హక్కుల ఉల్లంఘనతో సమానమని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బెగుసరాయ్‌లో తన తొలి ప్రచారసభలో ఈ మేరకు ప్రసంగించారు. దేశాభివృద్ధికి బీహార్ ఎంతో దోహదపడిందని అన్నారు.

కానీ రాష్ట్రాభివృద్ధి విషయంలో మాత్రం వెనుకబడిపోయిందని ప్రియాంక చెప్పారు. నెహ్రూ, ఇందిరాగాంధీలను బీజేపీ నేతలు విమర్శిస్తున్నారని, నిరుద్యోగం, వలసల వంటి అసలైన సమస్యలను పట్టించుకోవడం లేదని, పైగా విభజన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అయినప్పటికీ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించలేకపోయారని, అందుకే ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్డీయే వాగ్దానాలు చూసి మోసపోవద్దని హెచ్చరించారు.

బీహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కారు లేదని, ప్రతిదాన్ని ఢిల్లీ నుంచి నియంత్రిస్తారని ప్రియాంకగాంధీ విమర్శించారు. ఎన్డీయే పాలనలో ప్రైవేటీకరణ పెద్దఎత్తున జరుగుతోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని మోదీ కొందరికి అప్పగించారని ఆరోపించారు. అంతకు ముందు పట్నా విమానాశ్రయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in